క్లుప్తంగా

అంకమ్మతల్లి శక్తి పీఠంలో ప్రత్యేక పూజలు



మధురానగర్ (విజయవాడ సెంట్రల్): నేతాజీకాలనీలోని అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శక్తిపీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చన, శ్రీచక్రార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

డివిజన్‌లో సమస్యలు పరిష్కరిస్తాం

మధురానగర్(విజయవాడసెంట్రల్):డివిజన్‌లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి అన్నారు. మధురానగర్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. మురుగు సక్రమంగా పారటం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ప్రజల సమస్యలను స్వయంగా తాము తెలుసుకుని పరిష్కరించేందుకు డివిజన్‌లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఏఈ నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కంభం కొండలరావు, సముద్రపు గోవిందు, ఘనీ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యం సమకాలీనమై ఉండాలి

విజయవాడకల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని ప్రస్థానం సాహిత్య మాసపత్రిక సంపాదకుడు తెలకపల్లి రవి అన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం సాహిత్య ప్రస్థానం 20 ఏళ్ల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభను నిర్వహించారు. తెలకపల్లి రవి మాట్లాడుతూ సాహిత్యంలో సామాజిక జీవన చిత్రీకరణ కనిపించాలని సూచించారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ.. సాహిత్య ప్రస్థానం విలువలతో కూడిన వ్యాసాలను ప్రచురించిందన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ జి.అనిత, ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ, సాహితీవేత్త శాంతిశ్రీ సంచిక విశేషాలను వివరించారు.

ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

విజయవాడ కల్చరల్: గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి అన్నారు. పద్మ మెలోడీస్ 12 వ వార్షికోత్సవం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో అనేక సాంస్కృతిక కళా సంస్థలు ఉన్నాయని తెలిపారు. కళాకారుల సంక్షేమ కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పద్మా మెలోడీస్ వ్యవస్థాపకురాలు పద్మ మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, బాలజీకుమార్, కె.డేవిడ్‌రాజు, టి.శ్రీనివాసరెడ్డి, కొప్పుల ఆనంద్ పాల్గొన్నారు. పలు తెలుగు హిందీ చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను సత్కరించారు.

ఆరోగ్య హక్కు చట్టం కోసం వినతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వైద్య ఆరోగ్య సేవలు ప్రజల హక్కుగా ఉండే విధంగా ఆరోగ్య హక్కు చట్టాన్ని తీసుకురావాలని, ఆ చట్టాన్ని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని ప్రజారోగ్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం కోరింది. గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రజలకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలను ఉచితంగా ప్రభుత్వం అందించాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ పి.వి.రమేష్ మాట్లాడుతూ.. మనిషి జీవనశైలిలో, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా అనేక వ్యాధులు విస్తరిస్తున్నాయన్నారు. విపరీతంగా పెరుగుతున్న మందులు, వైద్య ఖర్చులను సాధారణ ప్రజలు భరించలేక మరింత పేదరికంలోకి చేరుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య, ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించటం సామాజిక బాధ్యత

మధురానగర్:వృద్ధులను ఆదరించటం సామాజిక బాధ్యతగా గుర్తించాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు బి. వసంతకుమార్ అన్నారు. సోషల్ సర్వీస్ సొసైటీ, కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన ఆదివారం మాతృదేవోభవ వృద్ధుల ఆశ్రమంలో నిత్యావసర వస్తువులు, వీల్ చైర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఆశ్రమానికి తన వంతు బాధ్యతగా సరుకులు అందజేస్తున్నట్లు తెలిపారు. కెనరా బ్యాంక్ యూనియన్ నాయకులు హరి వర్మ మాట్లాడుతూ తమకు వచ్చిన నెల జీతంలో కొంత భాగం సామాజిక సేవలకు ఉపయోగిస్తున్నామన్నారు.

ముస్లింల సంక్షేమానికి జగనన్న కృషి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, పక్కన ఎమ్మెల్సీ రుహుల్లా, గౌతంరెడ్డి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పాటుపడిన వైఎస్సార్ కుటుంబంతోనే ముస్లింలంతా పయనించడం సంతోషదాయకమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ఆధ్వర్యంలో 60వ డివిజన్ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం వాంబేకాలనీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడారు. ఆనాడు ముస్లిం మైనార్టీల హక్కులను గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని గుర్తుచేశారు. ఆయన వేసిన బాట ఎంతో మంది నిరుపేద ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి దోహదపడిందని చెప్పారు. టీడీపీ పాలనలో చంద్రబాబు ముస్లింలకు చేసింది శూన్యమని ధ్వజమెత్తారు. జగనన్న పాలనలో ముస్లింలకు ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నారో కళ్ల ముందే కనిపిస్తుందన్నారు. డెప్యూటీ సీఎం హోదా నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మన్, మేయర్లు వంటి ఉన్నతమైన పదవుల్లో ముస్లింలను కూర్చొబెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ సామాన్య కార్యకర్తలకు పెద్ద పెద్ద పదవులను కేటాయించిన గొప్ప సీఎం మన జగనన్న అన్నారు. ముస్లిం మైనార్టీలంతా జగనన్నకు ఎల్లవేళలా అండగా నిలుస్తామని తెలిపారు. ముస్లిం మత పెద్దలు, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపు సామాజిక వర్గానికి అండగా ఉంటా



ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును సత్కరిస్తున్న తూర్పు కాపు సంఘం ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తూర్పు కాపు సామాజిక వర్గానికి అన్ని విధాలా అండగా ఉంటానని సెంట్రల్ ఇన్‌చార్జి, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఆదివారం గాంధీనగర్ జింఖానా మైదానం వద్ద గల కందుకూరి కల్యాణ మండపంలో సెంట్రల్ నియోజకవర్గ తూర్పు కాపు సామాజిక వర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాసరావును తూర్పు కాపు సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తూర్పు కాపులకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని కోరారు. వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. నిరంతరం మీలో ఒకడిగా ఉంటూ మీతో కలిసి నడుస్తానని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఎంతో మేలు జరిగిందన్నారు. మరోసారి సీఎం వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు కోన శ్రీహరి మాట్లాడుతూ తూర్పు కాపులకు మంచి చేసిన ఏకైక వ్యక్తి జగనన్న అని చెప్పారు. తూర్పు కాపుల చిరకాల కోరిక అయిన కల్యాణ మండపం నిర్మాణానికి వైఎస్సార్ సీపీ స్థలం కేటాయించిందని పేర్కొన్నారు. తూర్పు కాపులకు మంచి చేసిన వారికి తాము నిరంతరం అండగా ఉంటామని తెలిపారు. వెలంపల్లి శ్రీనివాసరావు విజయానికి తూర్పు కాపు సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో 36వ కార్పొరేటర్ బాలి గోవింద్, నాయకులు సత్యనారాయణ, యలకల చలపతిరావు, తూర్పు కాపు సంఘం నాయకులు మీసాల రామకృష్ణ, చింత సింహాచలం, ఇజ్జాడ బాబ్జీరావు, ఇజ్జాడ తేజేష్, పిన్నింటి గణేష్, కేఎస్ఆర్ నాయుడు, చింత చిన్న, చిన్న సూరి, పెద్ద సూరి, వడ్డేపల్లి సామ్రాజ్యం, వాకమల్లు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ విద్య మరింత చేరువ

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాసరావు, పక్కన ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): పేదలకు ప్రభుత్వ విద్య మరింత చేరువ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి 63వ డివిజన్ రాజీవ్‌నగర్లో మాస్టర్ మైండ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ 23వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదివే పిల్లలకు జగనన్న అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి అనేక పథకాలను అందిస్తున్నారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలు సాధించడం ఖాయమన్నారు. చంద్రబాబు ఎన్నికల్లో గెలుపొందడానికి అనేక పార్టీలతో పొత్తులు పెట్టుకొంటున్నా గెలిచేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ 73 వేల కోట్ల రూపాయలను విద్య కోసం ఖర్చు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు ప్రవేశపెట్టి మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. క్రమశిక్షణగల విద్యాసంస్థగా మాస్టర్‌మైండ్స్ ఉందని అధినేత పి.అనిల్‌ను మల్లాది అభినందించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మోదుగుల గణేష్, పసుపులేటి యేసు, మేడా రమేష్, నార్త్ ఇండియన్ యాక్టర్, మెజీషియన్ మౌబాని సర్కార్, స్కూల్ ప్రిన్సిపాల్ మణికంఠ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కృష్ణప్రసాద్

పాయకాపురం(విజయవాడరూరల్):స్వచ్ఛంద సేవా సంస్థలు పేదలకు సేవలు అందించడం అభినందనీయమని డెప్యూటీ మేయర్ అవుతు శైలజ అన్నారు. స్పందన సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శైలజ మాట్లాడుతూ సమాజంలో సగభాగమైన మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్పందన సేవాసమితి నిర్వాహకులు గత కొన్ని సంవత్సరాలుగా పేదలకు సేవలందించడం అభినందనీయమని చెప్పారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఇమ్మనేని కృష్ణప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. అవుతు శైలజ, వికలాంగుల హక్కుల పోరాట సమితి మహిళా అధ్యక్షురాలు జి.సుజాత, ఎ.యశోద, ఎస్ఐ జ్యోతి కిరణ్, లయన్స్ క్లబ్ ప్రతినిధి చిన్నం శ్రీదేవి, ఆర్టీసీ కండక్టర్ షేక్ ఆషా తదిరులను సత్కరించారు. తొలుత స్పందన వాకర్స్ క్లబ్ ప్రారంభోత్సవం జరిగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ క్లబ్‌ను ప్రారంభించారు. ప్రధాన కార్యదర్శి వైకే శాస్త్రి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాపులకు జగనన్న సముచిత స్థానం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



కాపు నాయకులతో కలిసి వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):కాపులను కేవలం ఓటు బ్యాంకుగా వినియోగించుకోవడమే చంద్రబాబు తత్వమని, కాపులకు సంక్షేమాభివృద్ధిని అందించి.. అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జ్, ఎమ్మెల్య వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కాపు వెల్ఫేర్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు చింతా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక 59వ డివిజన్ సింగ్‌నగర్ గుజ్జల సరళాదేవీ కల్యాణ మండపంలో కాపుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు కానీ, టీడీపీ కానీ కాపులకు చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ కాపులకు అండగా నిలబడాల్సిన పవన్‌కళ్యాణ్ చంద్రబాబుకు అమ్ముడుపోయాడని ధ్వజమెత్తారు. కాపుల మనోభావాలను చంద్రబాబు కాళ్ల దగ్గర తాకట్టుపెట్టిన పవన్‌కళ్యాణ్‌కు కాపులంతా తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, కాపు నాయకులు చింతా చిన్నా, కమ్మిలి రత్నకుమార్, సిరిశెట్టి రాజా పాల్గొన్నారు.

మహిళలు అవకాశాలు వినియోగించుకోవాలి

కేడీసీసీ చైర్ పర్సన్ తానేని పద్మావతి, డాక్టర్ ప్రత్యూష



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమీప భవిష్యత్ మహిళలదేనని కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి, డాక్టర్ గన్నే ప్రత్యూష అన్నారు. బందరు రోడ్డులోని కేడీసీసీ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో కృష్ణా జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంగళగిరి ఎయిమ్స్ అప్తమాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ గన్నే ప్రత్యూష, కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి మహిళా దినోత్సవ విశిష్టతను వివరించారు. అన్ని రంగాల్లో మహిళలు గొప్పగా రాణిస్తున్నారని చెప్పారు. అవకాశాలను అందిపుచ్చుకుని మరింత పురోభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ సెక్రటరీ బీఎస్ రాంబాబు, సెంట్రల్ బ్యాంక్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఉదయ్ భాస్కర్, కృష్ణా జిల్లా సమన్వయ సమితి క్రియాశీలక అధ్యక్షుడు ఆంజనేయులు, అధ్యక్షుడు ఎన్. సుబ్బారావు కార్యదర్శి కె.రమేష్ బాబు, ఓల్గా దేవి, సుధా మాధురి, విజయవాడలోని ప్రధాన బ్యాంకుల నుంచి మహిళా ఉద్యోగులు, యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మైనార్టీల పక్షపాతి సీఎం జగన్

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



ప్రార్థనలు చేస్తున్న ఆసిఫ్, ఎండీ రుహుల్లా, గౌస్ మొహిద్దీన్ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీల పక్షపాతి అని.. ఆయన మైనార్టీల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా అహర్నిశలు శ్రమిస్తున్నారని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గం ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. 32వ డివిజన్ శాంతినగర్‌లో ఆదివారం రియాజుల్లా జన్నాత్ మసీదు ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్‌తో కలిసి మసీదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి కృషి చేసింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినో లేక చంద్రబాబునో తేల్చుకోవడానికి తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ విషయంపై దమ్ము ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ముస్లింల ఆశీర్వాదాలతో తనకు అవకాశం ఇచ్చిన జగనన్న కోసం అందరూ ప్రార్థించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో మైనార్టీలు గుణపాఠం చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మేస్థితిలో లేరని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన నేతలే చంద్రబాబును విశ్వసించటం లేదన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు అలీం, మసీదు ప్రెసిడెంట్ ముస్తఫా షరీఫ్, సెక్రటరీ ఉమర్ ఫారుక్, జాయింట్ సెక్రటరీ మన్సూర్ అహ్మద్, నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబా మందిర వార్షికోత్సవం



బాబాకు అభిషేకం చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి



సహస్ర కలశాలతో గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరం 36వ వార్షికోత్సవం ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతుల చేతుల మీదుగా బాబా వారికి వివిధ పుణ్య నదీ జలములతో విశేషంగా 1008 కలశములతో సహస్ర కలశాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం రెండు వేల మందికి అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో బాబావారిని ఉంచి ముత్యాలంపాడు పురవీధులమీదుగా మేళతాళాలతో ఊరేగించారు. దారి పొడవునా భక్తులు బాబాకు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పర్యవేక్షించారు.

సింగ్‌నగర్‌లో 'సిద్ధం' సందడి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):బాపట్ల జిల్లా మేదరమెట్ల వేదికగా ఆదివారం జరిగిన 'సిద్ధం' సభ హంగామా సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లో కూడా నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైన ఈ సభను సింగ్‌నగర్ ప్రాంత ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా భారీ స్క్రీన్‌ను ఏర్పాటుచేశారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలంతా హాజరై సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా తిలకించారు. 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, కోఆప్షన్ సభ్యులు అలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు కంభగళ్ల రాజు, ఎండీ హఫీజుల్లా, నందెపు సురేష్, కోలా శాంతకుమారి, షేక్ వెంకట్, నేరేళ్ల శివప్రసాద్, కృష్ణ, అమిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పొత్తులతో అవకాశవాద రాజకీయాలు

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): రానున్న ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవడం చంద్రబాబు సిగ్గులేని నీచ, అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ ఆరోపించారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలందరూ ఆనందంగా, భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి జాగారం చేస్తే చంద్రబాబు మాత్రం బిక్కుబిక్కుమంటూ ఢిల్లీలో బీజేపీ పెద్దల అపాయింట్‌మెంట్ కోసం జాగారం చేశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు 1999లో బీజేపీతో పొత్తు పెట్టుకొని 2001లో బయటకు వచ్చి మోదీని అరెస్ట్ చేయాలన్నారని గుర్తుచేశారు. మళ్లీ 2014లో పొత్తు పెట్టుకొని 2018లో బయటకు వచ్చి మోదీ మోసగాడు, పెళ్లాం, పిల్లలు లేనివాడు.. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశాడని ఏకంగా ఢిల్లీ వెళ్లి దీక్ష చేశాడని, తిరుపతి వచ్చిన అమిత్ షా కారుపై రాళ్లను వేయించారన్నారు. ఇప్పుడు మళ్లీ బీజేపీ, టీడీపీ పొత్తు పెట్టుకోవడం అంటే ఆ రెండు పార్టీల పరస్పర అవకాశవాద స్వార్థ రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. అమావాస్య రోజు పొడిచిన బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు చిత్తవడం ఖాయమన్నారు. చంద్రబాబు అసలు నైజం తెలియక బాకాలు ఊదిన కొందరు మైనారిటీ సోదరులు కూడా కళ్లు తెరవాలని సూచించారు.

వృద్ధులకు ఉచితంగా వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

మధురానగర్(విజయవాడసెంట్రల్):వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ అన్నారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము వయోవృద్ధులకు ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామని చెప్పారు. ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి వైద్యులచే మూడు రకాల చికిత్సలను అందిస్తున్నామని తెలిపారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు ట్రస్టీలు, దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని పేర్కొన్నారు. అనంతరం ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం, అల్లోపతి వైద్య నిపుణులు డాక్టర్ శరత్ చంద్ర ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 420 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



పాయకాపురం(విజయవాడరూరల్):త్వరలో నిర్వహించబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి సెంట్రల్ నియోజకవర్గంలో వెలంపల్లి శ్రీనివాసరావును అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు కుమార్తె సాయిఅశ్విత విజ్ఞప్తి చేశారు. ఆదివారం 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్లో డెప్యూటీ మేయర్ అవుతు శైలజ, కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, సాయిఅశ్విత, చక్రవర్తి ఇంటింటికి ప్రచారం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందించారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకొంటున్నారని తెలిపారు. డెప్యూటీ మేయర్ అవుతు శైలజా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డివిజన్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చక్రవర్తి, కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ మాట్లాడారు. పార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్, శ్రీరాములు, పందిరివాసు, మాతా మహేష్ జె.శివ, వెంకటేశ్వరమ్మ, డివిజన్ ఇన్‌చార్జి జలసూత్రం శ్రీనివాసరావు, డాక్టర్ చిన్నా, ఆర్‌కె తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండి అందజేత



తోపుడు బండి అందిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, బెజ్జం రవి, నాగుల్‌మీరా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):ముస్లిం అభ్యున్నతికి సీఎం జగనన్న ఎంతో కృషిచేశారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆజాద్ ముస్లిం కమిటీ 27వ నెల సేవా కార్యక్రమంలో భాగంగా సింగ్‌నగర్‌కు చెందిన ఓ నిరు పేద ముస్లిం కుటుంబానికి ఆదివారం తోపుడు బండిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు ఆనాడు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారని చెప్పారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ఆనాడు వైఎస్సార్ పెద్దపీట వేస్తే నేడు ఆయన తనయుడు సీఎం జగనన్న ముస్లింలను మరింత ఉన్నత స్థానంలో కూర్చొబెట్టారన్నారు. నిరుపేద ముస్లింలను ఆదుకునేందుకు ఆజాద్ ముస్లిం కమిటీ చేస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బెజ్జం రవికుమార్, మంజూరే ఖుదా ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బషీర్, ఆజాద్ ముస్లిం కమిటీ నాయకులు షేక్ సాజిద్ అలీ, యండి కాలేషా, సయ్యద్ మౌలాలి, షేక్ మస్తాన్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ మూర్తి సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: రంగస్థల నటుడు, దర్శకుడు జి.రాధాకృష్ణ మూర్తి రంగస్థల సేవలు వెలకట్టలేనివని సుమధర కళానికేతన్ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు అన్నారు. సుమధర కళానికేతన్, దృశ్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం రంగస్థల ప్రముఖుడు రాధాకృష్ణ మూర్తి సంతాప సభ నిర్వహించారు. నరసరాజు మాట్లాడుతూ నగరంలో జరిగిన నాటకోత్సవాలు, సుమధర కళానికేతన్ నిర్వహించిన నాటక పోటీల్లో క్రియా శీలకమైన పాత్ర పోషించినట్లు తెలిపారు. దృశ్యవేదిక వ్యవస్థాపకుడు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ హాస్య దర్శకుడు జంధ్యాల వీరివద్దనే దర్శకత్వంలో మెలకువలు నేర్చుకున్నట్లు తెలిపారు. సుమధర కళానికేతన్ ప్రధాన కార్యదర్శి పి.భాస్కరశర్మ, నాటక రంగ ప్రముఖులు బోడి ఆంజనేయరాజు, డాక్టర్ కైలాసరావు, హృదయరాజ్, దొంతల ప్రకాష్, కత్తి శ్యాంప్రసాద్, జగన్నాధరావు, రమేష్ పాల్గొన్నారు. రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు.